వైభవంగా నూకాంబిక జాతర

- ఆలయాల్లో విశేష పూజలు.. అన్నసమారాధనలు
- అమ్మవారిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు



నలందనగర్‌లో నూకాంబిక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, కార్పొరేటర్‌ చల్లా రజని

కంచరపాలెం: కొత్త అమావాస్య సందర్భంగా సోమవారం నియోజకవర్గంలో నూకాంబిక అమ్మవారి ప్రధాన జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి.. మనసారా పూజించి మొక్కులు చెల్లించుకున్నారు. జీవీఎంసీ 46, 47, 48, 54, 55 వార్డుల కొండవాలు ప్రాంతాల్లో వెలసిన నూకాంబిక ఆలయాలను వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సందర్శించారు. 46వ వార్డు కస్తూరినగర్, 47వ వార్డు రాంజీ ఎస్టేట్, 48వ వార్డు న్యూ శ్రీనివాసనగర్‌లో సిహెచ్. సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో, 54వ వార్డు నలందనగర్, 55వ వార్డు గాంధీనగర్ ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు మజ్జిగ, కూల్‌డ్రింక్స్ పంపిణీ చేశారు. ఆలయాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.కె.రాజును ఉత్సవ కమిటీల సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్లు చల్లా రజని, కె.వి.ఎస్.శశికళ, సీనియర్ నాయకులు నీలి రవి, కర్రి రామారెడ్డి, వసంతల అప్పారావు, ఆయా ఆలయాల ఉత్సవ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్త అమావాస్య పూజలు

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు ఆర్ అండ్ బీ దరి శ్రీరామ్‌నగర్ కాలనీలో కొలువైన నూకాంబిక అమ్మవారిని కొత్త అమావాస్య సందర్భంగా సోమవారం వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, షేక్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గ్రౌండ్స్ ఆలయంలో..

తాటిచెట్లపాలెం: రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే గ్రౌండ్స్ వద్ద గల నూకాంబిక ఆలయంలో రైల్వే వాకర్స్ ఆధ్వర్యంలో జరిగిన కొత్త అమావాస్య పూజల్లో వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె. రాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కస్తూరినగర్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



గాంధీనగర్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న కె.కె.రాజు తదితరులు



శ్రీరామ్‌నగర్ ఆలయ ఆవరణలో కె.కె.రాజు, బర్కత్ అలీ

జగనన్న పాలనలో క్రీడాకారులకు ప్రోత్సాహం



క్రీడాకారులతో ముచ్చటిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు



రైల్వే గ్రౌండ్స్‌లో వాకర్స్, పార్టీ శ్రేణులతో కలిసి వాకింగ్‌చేస్తున్న కె.కె.రాజు

రైల్వే గ్రౌండ్స్‌లో క్రీడాకారులు, వాకర్స్‌తో ముచ్చటించిన కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సోమవారం రైల్వే ఫుట్‌బాల్ గ్రౌండ్స్‌లో మార్నింగ్ వాక్ నిర్వహించారు. అక్కడికి వచ్చిన వాకర్స్, క్రీడాకారులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి యువతకు అత్యధిక ప్రాధాన్యం కల్పించారన్నారు. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి, వారిని ప్రోత్సహించేందుకు పలు క్రీడా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ విజయానికి సహకరించాలని కోరారు. వాకర్స్, పార్టీ శ్రేణులతో కలిసి కె.కె.రాజు వాకింగ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆళ్ల శ్రీనివాస్, బాకి శ్యామ్‌కుమార్, రమణమూర్తి, రాయుడు శ్రీను, ఎస్.ప్రసాదరావు, అమర్‌రెడ్డి, బొడ్డేటి గంగా మహేష్, నూకరాజు, పులపా రవీంద్రనాథ్ ఠాగూర్, యడ్ల శ్రీనివాసరెడ్డి, పోతల కన్నప్పడు, గోపి, సత్తిబాబు, భద్రి, పద్మశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులతో ఆత్మీయ సమావేశం

సీతమ్మధార: నియోజకవర్గ పరిధిలోని ఆటో కార్మికులతో వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సోమవారం పార్టీ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆటో స్టాండ్ అధ్యక్ష, కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.



ఆటో కార్మికులతో ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న కె.కె.రాజు

సీతంపేట: బొడ్డేటి గోవిందరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్‌లో బొడ్డేటి కిరణ్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ప్రారంభించారు. అందరికీ ఆయన చేతుల మీదుగా చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, నాయకులు బులుసు జగదీష్, కొణతాల రేవతీరావు, అమ్మాజి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పూజలకు ఆలయాలు ముస్తాబు

సీతమ్మధార: స్థానిక ఆలయాలను ఉగాది పూజలకు ముస్తాబు చేశారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో మామిడి కొమ్మల తోరణాలు, పువ్వులతో అలంకరించారు. మంగళవారం షిర్డీసాయిబాబాకు క్షీరాభిషేకం చేస్తున్నట్లు ప్రధాన అర్చకుడు రాజాస్వామి తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, సాయంత్రం 6.30 గంటలకు రామారావు శర్మచే పంచాంగ శ్రవణ జరుగుతాయని చెప్పారు. గణేష్‌నగర్, నక్కవానిపాలెం తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తిచేశారు.

నేటి నుంచి సీతారామ కల్యాణోత్సవాలు

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో ఉగాది నుంచి వసంత నవరాత్రి సీతారామ కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఈ నెల 9వ తేదీ చైత్ర శుద్ధ పాడ్యమి నుంచి 18 దశమి వరకు కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. ఉగాది రోజు లలితాదేవికి క్షీరాభిషేకం, బంగారు చీర అలంకరణ, పంచాంగ శ్రవణం, కర్ణాటక సంగీత కచేరి నిర్వహిస్తామని చెప్పారు. 12వ తేదీన వారాహి హోమం, 13న రాజశ్యామల హోమం, 16న విష్వక్సేన పూజ, 17న ఉదయం 9 గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవం, 18న చక్రస్నానం, పూర్ణాహుతి జరుగుతాయని, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఫుడ్ కార్నివాల్ నేడు

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో మంగళవారం సాయంత్రం నిర్వహించే ఉగాది సంబరాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, కార్యదర్శి పీవీఎస్ రాజు తెలిపారు. పంచాంగ శ్రవణం అనంతరం గోదావరి రుచులతో కూడిన ఫుడ్ కార్నివాల్ నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా బాలబాలికల సంప్రదాయ నృత్య ప్రదర్శన, కోలాటం, జానపద నృత్య ప్రదర్శన జరుగుతాయని చెప్పారు. మురళీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొని గోదావరి రుచులు ఆస్వాదించాలని వారు కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సబాస్టియన్ కాలనీ 319 సచివాలయం పరిధి శివాలయం వెనుక బూట్ లాండ్రీ, స్పార్కెల్ లాండ్రీ సర్వీసెస్ ఎదురుగా ఉన్న తుప్పల్లో సుమారు 40 నుంచి 50 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే సచివాలయ మహిళా పోలీస్‌కు సమాచారం అందించారు. మహిళా పోలీస్‌తోపాటు అక్కడ విధులు నిర్వహిస్తున్న వీఆర్‌వో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తి కోసం విచారించగా చుట్టుపక్కల ప్రాంతాల్లో భిక్షాటన చేస్తుంటాడని తెలిసింది. అతడు చనిపోయి సుమారు 3 నుంచి 5 రోజులై ఉండవచ్చని, శవం కుళ్లిపోయింది. ఐదో పట్టణ పోలీసులకు సోమవారం వీఆర్‌వో ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ బి.నరసింహమూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

వివాహిత అనుమానాస్పద మృతి

ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీపీ



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీపీ రవిశంకర్ (ఇన్‌సెట్) కలదారపు ఈశ్వరి మృతదేహం

సీతమ్మధార: ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలిలా.. ద్వారకానగర్ రెండో లేన్‌లోని రామ్స్ ప్లాజాలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న అమలాపురానికి చెందిన వ్యక్తి కుమార్తె కలదారపు ఈశ్వరి(33)కి భర్త దుర్గాప్రసాద్(పెయింటర్), పాప(8), ఒక బాబు(2) ఉన్నారు. వారంతా అక్కడే కలిసి నివసిస్తున్నారు. ఈశ్వరికి ఐదేళ్ల కిందట డైమండ్ పార్కు సమీపంలోని ఒక హోటల్‌లో కుక్‌గా పనిచేస్తున్న సయ్యద్ అలీతో పరిచయం ఏర్పడింది. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో వాచ్‌మెన్ ఇంటికి వచ్చిన సయ్యద్ ఇన్సూరెన్స్ ఆఫీస్‌కు ఈశ్వరిని తీసుకెళ్లాడు. తిరిగి ఇంటికి తీసుకొచ్చే సమయంలో వాహనం పైనుంచి పడి ఆమె తలకు గాయం కావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లి వచ్చి ఇంటి వద్ద వదిలి వెళ్లిపోయాడు. ఆ తరువాత అతడికి ఈశ్వరి కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారమిచ్చారు. విషయం తెలిసిన వెంటనే నగర పోలీస్ కమిషనర్ డా.రవిశంకర్ అయ్యనార్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ద్వారకా సబ్ డివిజన్ ఏసీపీ రాంబాబు, సీఐ ఎస్.రమేష్, ఎస్ఐ ధర్మేంద్ర, శ్రీను డైమండ్ పార్కు, ఐసీఐసీఐ బ్యాంక్ ప్రాంతంలోని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఏసీపీ తెలిపారు. ఇంటి నుంచి తీసుకెళ్లి తన కుమార్తెను విగతజీవిగా తీసుకొచ్చారని మృతురాలి కుటుంబ సభ్యులు విలపించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి లేదు

- 'కూటమి' నాయకులు దుష్ప్రచారాలు మానుకోవాలి
- 'ఉత్తర'లో కె.కె.రాజు ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి పనులు
- డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి టీడీపీ–జనసేన–బీజేపీ కూటమికి లేదని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అన్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల కోసం ఏర్పాటైన కూటమి నాయకుల తీరుపై ఘాటుగా స్పందించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుకు మతిభ్రమించి కె.కె.రాజుపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఆయన ఉన్నప్పుడు టిడ్కో ఇళ్ల కోసం పట్టించుకోలేదని, సొంత కాంట్రాక్ట్ ప్రయోజనాల దృష్ట్యా గాలికొదిలేశారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఉత్తర సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఆధ్వర్యంలో 45వ వార్డు ఏఎస్సార్ నగర్‌లో 283 మందికి టిడ్కో ఇళ్లను ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఉత్తర నియోజకవర్గంలో రూ.4,028 కోట్లు వెచ్చించి అనేక అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.

ఎమ్మెల్యేగా విష్ణుకుమార్‌రాజు ఏం సాధించారు..?

2014 నుంచి 2019 వరకు ఎమ్మెల్యేగా ఉన్న విష్ణుకుమార్‌రాజు ఏం సాధించారని కటుమూరి సతీష్ ప్రశ్నించారు. గత ప్రభుత్వ పాలనపై, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కరోనా సమయంలో కూటమి నాయకులు ఏమయ్యారని ప్రశ్నించారు. ఎన్ని విపత్కర పరిస్థితులు ఎదురైనా సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలన కొనసాగించారని గుర్తు చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో ముస్లింలకు కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్‌ను బీజేపీ నాయకులు రద్దు చేయాలని ఆలోచిస్తున్నారని ఆరోపించారు. మిమ్మల్ని ఆదరించిన ఉత్తరాంధ్ర ప్రజలపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎన్నికల ప్రచారంలో సైతం ప్రజల ముందు ఏం మాట్లాడాలో తెలియక అధికారం చేపట్టిన అనంతరం లిక్కర్ ధరలు తగ్గిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. జీవీఎంసీ ఎన్నికల్లో ఉత్తర నియోజకవర్గంలో కె.కె.రాజు సామాజిక న్యాయం చేసి సీట్లు కేటాయించారన్నారు. కూటమి నాయకులు దుష్ప్రచారాలు మాని ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. సమావేశంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, నాయకులు చల్లా ఈశ్వరరావు, ఆళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


కాలానుగుణంగా మార్పు అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

మురళీనగర్: డిప్లొమా విద్యార్థులు సోషల్ సైన్స్‌ను కూడా అధ్యయనం చేయాలని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ జనరల్ మేనేజర్ కె.తిలక్ కుమార్ సూచించారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన సోమవారం కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భారత రాజ్యాంగం, సామాజిక అవగాహన, పరిపాలన నైపుణ్యాల గురించి తెలుసుకోవాలన్నారు. సాంకేతిక విద్యలో పట్టు సాధించడంతోపాటు మారుతున్న కాలానికి అనుగుణంగా మనం మారాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగం పుస్తకాన్ని ఆయన కాలేజీ లైబ్రరీకి అందించారు. ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్ చీఫ్ కన్సల్టెంట్ కె.ఎన్.ఎస్.ప్రకాశరావు మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాభివృద్ధికి అవసరమైన కోర్సుల నేర్చుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ నారాయణరావు మాట్లాడుతూ ఉద్యోగాల సాధనలో తమ కాలేజీ ముందంజలో ఉందన్నారు. నాలుగు బ్రాంచీలకు త్వరలో ఎన్‌బీఏ గుర్తింపు లభిస్తుందని చెప్పారు. వార్షికోత్సవంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ, పెందుర్తి పాలిటెక్నిక్ ఓఎస్‌డీ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, కాలేజీ వివిధ విభాగాల అధిపతులు, ఫిజికల్ డైరెక్టర్ పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం



ఆరోగ్య సూచనలిస్తున్న డాక్టర్ మురళీకృష్ణ

మురళీనగర్: సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని అపోలో హాస్పిటల్స్ ఎముకలు, కీళ్ల వ్యాధుల నిపుణుడు డాక్టర్ బి.మురళీకృష్ణ అన్నారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. వెన్నెముక సమస్యలను చాలా వరకు శస్త్రచికిత్సలు లేకుండా నివారించవచ్చని చెప్పారు. ఎముకల సాంద్రతను పరీక్షించుకుని వైద్యుల సలహాల మేరకు మందులు వాడాలని సూచించారు. ఆరోగ్య పరిరక్షణకు అనుసరించాల్సిన ఆహార నియమాలను క్లినికల్ న్యూట్రిషనిస్ట్ డాక్టర్ వసుంధర పద్మ వివరించారు. డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ వసుంధర పద్మలను వాకర్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, పూర్వాధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, కె.ద్వారకానాథ్, ఎం.భాస్కరరావు, కేజీ కృష్ణారావు, సీహెచ్ కృష్ణమూర్తి, ఎస్.సునీల్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఏవీ సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ ప్రసాదరావు, జాలీ వాకర్ ప్రకాశరావు, ఆర్.నాగేశ్వరరావు మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు లలితారెడ్డి, అపోలో హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ రాజేష్ పాల్గొన్నారు.

నేడు 'చల్ చల్ గుర్రం' నాటిక ప్రదర్శన

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వాకర్స్ పార్కు ఆవరణలో మంగళవారం సాయంత్రం నిర్వహించనున్న ఉగాది వేడుకల్లో భాగంగా చల్ చల్ గుర్రం నాటిక ప్రదర్శన ఉంటుందని క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి పి.చెల్వరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సుసరాపు చంద్రశేఖ శర్మ పంచాంగ శ్రవణం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తారు. విశాఖలోని సాయి స్నేహ క్రియేషన్స్ ఆధ్వర్యంలో సాయంత్రం 6.30 గంటలకు రంగస్థల, సినీ నటుడు ఎస్.కె.మిశ్రో, మిశ్రో శిష్యుడు రంగస్థల, సినీ నటుడు మాచిరాజు నారాయణరావును సత్కరిస్తారు. అనంతరం మాచిరాజు నారాయణరావు సమర్పణలో నటుడు ఎస్.వి.ఎల్.ఎన్.ప్రసాద్ మిమిక్రీ, ప్రముఖ రచయిత, సినీ నటుడు తనికెళ్ల భరణి రచించిన చల్ చల్ గుర్రం హాస్య నాటిక ఎస్.వి.ఎల్.ఎన్.ప్రసాద్ దర్శకత్వంలో ప్రదర్శిస్తారు.

అలరించిన ఉగాది కవి సమ్మేళనం



భాగవతుల కృష్ణారావును సత్కరిస్తున్న కవులు, రచయితలు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో శ్రీక్రోధి నామ సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ఉగాది కవి సమ్మేళనంలో కవులు ఆశావాద దృక్పథంతో క్రోధను ఆహ్వానించాలన్నారు. ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి మాట్లాడుతూ ఉగాది నుంచి ప్రతి ఒక్కరూ నూతన ఆలోచనలతో ప్రగతి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం క్రోధ నామ సంవత్సరం ఫలాలను, పంచాంగంలోని ముఖ్య విషయాలను వివరించారు. డాక్టర్ ఎస్.విజయకుమార్ మాట్లాడుతూ కవులు సమాజ ప్రగతిని కాంక్షించాలన్నారు. 35 మంది కవులు తమ కవితలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా కవి, నటుడు భాగవతుల కృష్ణారావును సత్కరించారు.

కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి సి.హెచ్.చిన సూర్యనారాయణ, కవులు భాగవతుల సత్యనారాయణమూర్తి, డి.వి.సూర్యారావు, మేడా మస్తాన్ రెడ్డి, ఉప్పల అప్పలరాజు, కుప్పిలి భీమేశ్వరరావు, కొత్తూరి రమణ, అడపా రామకృష్ణ, రామతాత, కె.జి.వేణు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో సోషల్ స్టడీస్‌కు ప్రాధాన్యం

విశాఖ విద్య: ప్రభుత్వ బడుల్లో సోషల్ స్టడీస్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని సోషల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు ఇమంది పైడిరాజు అన్నారు. సోషల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. నగరంలోని జూబ్లీ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడుగా ఇమంది పైడిరాజు (అడవివరం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం), అధ్యక్షుడిగా సింగంపల్లి రామారావు(జీహెచ్‌ఎస్ పెందుర్తి), ప్రధాన కార్యదర్శిగా వి.బాలాజీ ఎంపికయ్యారు. మహిళా ప్రతినిధిగా ఎస్. సంధ్యారాణి (ప్రభుత్వ క్వీన్ మేరీ స్కూల్), గౌరవ సలహాదారుగా ఎస్.కృష్ణారావు, రాష్ట్ర కౌన్సిలర్‌గా టీ.రామారావు, అకడమిక్ సెల్ కన్వీనర్‌గా ఆర్‌వీ.నారాయణను ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.పాండవులు, ఆర్థిక కార్యదర్శిగా ఎంవీఆర్ సోమరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ ఎస్.మహేశ్వరరావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

వివాహిత అదృశ్యం

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపి వివరాలిలా.. మురళీనగర్ దరి ఎన్‌జీజీవోస్ కాలనీలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న ధనాల ప్రియదర్శినికి మూడేళ్ల కిందట వివాహం జరిగింది. రెండేళ్ల కుమారుడు, 11 నెలల కుమార్తె ఉన్నారు. కుమార్తె పుట్టిన తర్వాత నుంచి ఆమె పుట్టింటిలోనే ఉండిపోయింది. ఈ నెల 4న ఇంట్లో పిల్లలను వదిలేసి వెళ్లిపోయినట్టు ఆమె తల్లి వాణి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఏఎస్ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.

అన్నదానం.. పుణ్య కార్యం



నిత్యాన్నదానంలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు, పేదలు (ఫైల్)

- రైల్వే న్యూకాలనీ ధ్యాన మందిరంలో మహత్తర కార్యక్రమానికి 14 ఏళ్లు
- నేటి(ఉగాది) నుంచి ప్రత్యేక కార్యక్రమాలు

తాటిచెట్లపాలెం: అన్ని దానాల్లో అన్నదానం మిన్న. ఇది ఒక గొప్ప పుణ్య కార్యం. ఈ మహత్తర కార్యక్రమాన్ని రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో ప్రారంభించి ఉగాది నాటికి 14 వసంతాలు పూర్తయ్యాయి. అన్నదాన మహోత్సవ వార్షికోత్సవ సందర్భంగా ఉగాది పండగ రోజు నుంచి శ్రీరామ నవమి వరకు ప్రత్యేక కార్యక్రమాలు, భారీ అన్నదానం నిర్వహిస్తున్నారు. ధ్యాన మందిరంలో మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేస్తారు.

2010లో మొదలై..

ధ్యాన మందిరంలో 2010లో ఉగాది పర్వదినాన మందిర వ్యవస్థాపకులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాడు కేవలం10 మందితో గురువారాల్లో మాత్రమే అన్నదానం జరిగేది. నేడు దిన దిన ప్రవర్ధమానమై నిత్యాన్నదానంగా మారింది. నాటి నుంచి ప్రతీ ఏడాది క్రమం తప్పకుండా ఉగాది రోజుల్లో అన్నదాన వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మామూలు రోజుల్లో 100 మంది, గురువారాల్లో 200 మంది వరకు ఇక్కడ జరిగే అన్నదానంలో పాల్గొంటున్నారు. కొన్నేళ్లుగా పేదలు, యాచకులు, భక్తులతోపాటు వివిధ మాలధారులకు ప్రత్యేకంగా అన్నదానం చేస్తున్నారు. ఏ సమయంలోనైనా అన్నార్తుల ఆకలి తీర్చేందుకు ఇంటర్నేషనల్ వైశ్ ఫౌండేషన్ సహకారంతో సమకూర్చిన కమ్యూనిటీ ఫ్రిజ్‌లో 24 గంటలూ ఆహారం అందుబాటులో ఉంచుతున్నారు.



ఉగాది వేడుకలకు సిద్ధమైన ధ్యాన మందిరం



ప్రత్యేక అన్నదానంలో పాల్గొన్న వివిధ మాలధారులు(ఫైల్)

భక్తులు, దాతల సహకారంతో నిత్యాన్నదానం



భక్తులు, దాతలు సహకారంతో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని 14 ఏళ్లుగా నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నాం. సాయిబాబా దయతో ప్రతి రోజు అన్నార్తుల ఆకలిని తీర్చగలుగుతున్నాం. ప్రత్యేకంగా వంటలు చేసి 30, 40 రోజులు వివిధ మాలలు ధరించిన వారికి అన్నప్రసాదం అందిస్తున్నాం.

– నూకల శేషగిరిరావు, ధ్యాన మందిర వ్యవస్థాపకుడు

ప్రత్యేక పూజా కార్యక్రమాలు



ఉగాది సందర్భంగా మంగళవారం ఉదయం 6 గంటల నుంచి విఘ్నేశ్వర పూజ, బాబాకు ప్రత్యేక క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చన, పంచాంగ శ్రవణం, బాబా గీతాలాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మధ్యాహ్నం భారీ అన్నదానం జరుగుతుంది.

– త్రిపురాన రాంబాబు, ధ్యాన మందిర వ్యవస్థాపకుడు